దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు::ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ప్రతి పార్లమెంట్ నియోజక వర్గ స్థాయిలో ఒక స్కిల్ కాలేజ్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ సహకారంతో జిల్లాలో అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో అరకు వ్యాలీలో స్కిల్ కాలేజ్ యువజన శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కిల్ కాలేజ్ లో హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ ఔట్లెట్ మేనేజర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కోర్స్‌ల్లో చేరేందుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు.ఈ స్కిల్ కాలేజ్‌లో ఉచిత శిక్షణ, ఉపాధితో పాటు వసతి, బోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ కాలం 5 నెలల నుండి 6 నెలలు ఉంటుందని, శిక్షణ అనంతరం సర్టిఫికేట్, ఉపాధి చూపుతారని పేర్కొన్నారు. డిశంబరు రెండవ వారం నుంచి శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ఈలోపు ఆసక్తి ఉన్న అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9014767230, 9398338105 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మూతపడిన 'చాపరాయి'

▸▸ పారిశుధ్య పనులతో పర్యాటకులకు అనుమతి నిషేధం

▸▸ కలెక్టర్ ఆదేశంతో ముమ్మరంగా పనులు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం గత రెండు రోజులుగా మూతబడింది. అక్కడ ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్ తో పాటు ఇతర చెత్తా చెదారం అంతా పేరుకు పోయి అపరిశుద్ధ్యంగా మారింది. టెండర్ పాట నిర్వాహకులు పారిశుద్ధ్యం తొలగింపునకు చర్యలు తీసుకోక పోవడంతో గత రెండు రోజుల క్రితం మండలంలో పర్యటించిన అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానిక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో, అధికారులు గత రెండు రోజులుగా చాపరాయి ప్రవేశ, పార్కింగ్ రుసుం వసూలు చేయకుండా పర్యాటకుల అనుమతి నిలుపుదల చేయడంతో మూతబడింది. పిక్నిక్ సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో పర్యాటకలు సందర్శిస్తుంటారు. పర్యాటకులు ఉపయోగించిన పేపర్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిల్స్ తో పాటు ఇతర చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉండగా, ఆ పనులను చేయకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా పేరుకుపోయి అద్వానంగా తయారయింది. దీంతో, అక్కడ తిలకించిన పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పర్యాటకల నుంచి ప్రవేశ, పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఇటీవల సందర్శించి పరిశీలించగా, అక్కడ పారిశుద్ధ్యం పేరుకు పోవడంతో సంబంధిత అధికారులతో పాటు టెండర్ నిర్వాహకులకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే అపారిశుద్యం తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో స్థానిక సంబంధిత అధికారులు గత రెండు రోజులుగా ఆ పనిలో నిమగ్నమై ఉన్నారు. గతంలో సందర్శించి అపారిశుద్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇక్కడి సంబంధిత అధికారులు, టెండర్ నిర్వాహకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఆదేశాలు చేయడంతో అధికారులు హడావిడిగా చెత్తా చెదారాన్ని తొలగిస్తుండటంతో ఇక్కడ తిలకించే పర్యాటకులతో పాటు స్థానికులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం తొలగించడంతో పాటు మరుగుదొడ్లలో వాడుక నీటి సౌకర్యం కూడా కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

నిరామనుష్యంగా ఉన్న చాపరాయి జలపాతం

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 1008 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 3,4 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, బిఎల్ఓలు ఓటర్ల జాబితాలతో ఉదయం 8 గంటలు నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పక హాజరై ఓటరు నమోదు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డిఆర్ఓ కోరారు. ముసాయిదా ప్రచురణ చేసిన తరువాత చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఓటర్ల వివరాల్లో సవరణకు అందిన క్లెయిమ్ దరఖాస్తుల వివరాల జాబితాను వివిధ రాజకీయ ప్రతినిదులకు అందజేయడం జరిగిందన్నారు. యువ ఓటర్లు, ముఖ్యంగా ఆదిమ తెగనివాసం ఉండే ఆవాసాలలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వారందరి పేర్లు నూరు శాతం ఓటర్ల జాబితాలో నమోదు అయ్యే విధంగా తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితాల్లో డెత్ కేసులు, షిఫ్టెడ్ కేసులు, డబల్ ఎంట్రీలు ఉన్నట్లు గుర్తించామని, వాటిని సవరించాలని ఆదేశించారు. ఈ నెల 8వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, 26వ తేదీలోపు పరిష్కరించి తుది జాబితా జనవరి 05న విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైసిపి, బిజెపి, సిపిఐ, సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఓ దయానిధి

గోతులు పడిన మట్టిరోడ్డును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మారుమూల గ్రామాలకు రహదారులు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం

మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం వై.రామవరం మండలం కానివాడ రహదారి ఏర్పాటు చేయడానికి ప్రాజెక్ట్ అధికారి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన కానీవాడ పంచాయతీలో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ పల్లాల శిల్పారాణి తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదన తయారు చేసి సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

అనంతరం మారేడుమిల్లి మండలం బంద ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించి ఆ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నదీ, ప్రతిరోజు ఏయే ఆహారం పెడుతున్నదీ, సరుకులు సకాలంలో వస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌ను పరిశీలించారు. కాంట్రాక్టరు తాజా కూరగాయలు తీసుకువచ్చే విధంగా ఎప్పటికప్పుడు సంప్రదించాలని వార్డెన్‌కు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందన వినతులపై జవాబుదారీగా ఉండాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరుటౌన్: స్పందన వినతుల పరిష్కారం లో అధికారుల జవాబుదారీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌లతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం 78 ఫిర్యాదులు స్వీరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై శుక్రవారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించాలన్నారు.సమస్యలు పరిష్కరించ లేకపోతే గ్రామాలకు వెళ్లి అర్జీదారులకు వివరించి అర్జీదారుని ఫోటోలను స్పందన వెబ్ సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లా అధికారులు రెడ్ క్రాస్ సొసైటీలో జీవిత కాల సభ్యులుగా చేరాలన్నారు. రక్త సేకరణకు అధికారులు సహకరించాలని సూచించారు.

అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీకి చెందిన కిముడు దేముడు విశాఖపట్నం కెజిహెచ్‌లో డయాల సిస్ చేయించుకుంటున్నానని, ఫించను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం వంజంగి సర్పంచ్ వంతాల బొంజుబాబు వంజంగి పంచాయతీలోని వై.సంపాలు, పోతురాజు మెట్ట, కల్లాల బయలు, దొడ్డిపల్లి, బొర్రమామిడి, గ్రామాలకు రోడ్లు నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. కొయ్యూరు మండలం నిమ్మలగొంది గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఎస్.సత్తిబాబు, ఎస్. సత్యనారాయణ, వి.రంగారావు వినతిపత్రం అందజేసారు. రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ గుర్రాలు బైలు, గదభపాలెం, బి.పట్నం గ్రామాలకు చెందిన పివిటిజిలకు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని నల్లి పోతురాజు తదితరులు కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ లోయల పాలెం గ్రామస్తురాలు కిల్లో చిన్నమ్మి తన ఆర్ఒఎఫ్ఆర్ పట్టా భూమిని గిరి భూమి పోర్టల్ లో నమోదు చేయాలని కోరారు. అనంతరం సైనిక వెల్ఫేర్ శాఖకు చెందిన గోడ పత్రికను, స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రంపులో ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం, టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, డిఇఒ పి.రమేష్, డిఎంహెచ్ఒ జమాల్ భాషా, టిడబ్ల్యు ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, ఆర్అండ్‌బి ఇఇ బాల సుందరబావు, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ కేంద్రంలో లీకేజీ అవుతున్న తాగునీటి పైపు లైన్‌కు ఆ గ్రామ సర్పంచ్ పులి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.లక్ష్మణరావు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పనకు వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గిరి విద్యార్థులకు ప్రత్యేక హెూస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, 2017లో అక్కడ ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాల ప్రారంభించడంతో, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాల కలిపి ఓకే దగ్గర హాస్టల్ భోజన సౌకర్యం కల్పించే వారన్నారు. ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాల విద్యార్థులకు నూతనంగా నిర్మించిన జైపూర్ జంక్షన్‌లో మార్పు చేశారన్నారు. దీంతో, అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు హాస్టల్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే సుమారు 300 మంది విద్యార్థులకు గతంలో మాదిరిగా ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కే అప్పలనాయుడు, సిహెచ్ రామమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతునన జిల్లా ఇంటర్‌మీటియట్ ఎడ్యుకేషన అధికారి బెన్నస్వామి

నాడు - నేడు పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బెన్న స్వామి సూచించారు. మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు నేడు పనులకు సంబంధించిన ఖర్చులను కళాశాల కమిటీ తీర్మానం చేశాకే చెల్లింపులు చేయాలని, ముందస్తుగా ఎవరికి ఇవ్వవద్దని కళాశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. నిబంధనలకు లోబడే పనులు చేయించి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భవన నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం జరగకుండా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఈ నెల 12 నుంచి 17 వరకు జరిగే అర్ధ సంవత్సర పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది దామోదరం, రమణ, రమేష్ పాల్గొన్నారు.

5న వాహనాల వేలంపాట

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఆటోలు 3, స్కూటర్లు 2 వాహనాలకు ఈనెల 5న వేలం పాట నిర్వహిస్తున్నట్లు అరకు సర్కిల్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ గణపతిబాబు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫోన్: నెంబర్లను 9440902396, 6281322458, 8500455420 సంప్రదించాలని ఆయన కోరారు.

సిపిఎం ప్రజా సంఘాల్లో 15 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-చింతూరు

అధికార వైసిపి విధి విధానాలు నచ్చక మండలంలోని వాలుమూరు గొంది గ్రామానికి చెందిన ఆ పార్టీకి చెందిన సోడే రామ్ శెట్టి, పాయం శంకరయ్య, నాగరాజు ఆధ్వర్యాన 15 కుటుంబాల వారు సిపిఎం ప్రజా సంఘాల్లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సోడే రామ్ శెట్టి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గిరిజన చట్టాలు అమలు కోసం సిపిఎం నిరంతరం పోరాడుతుందని చెప్పారు. అధికార వైసిపి నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలను మాత్రమే చూసుకుంటున్నారని విమర్శించారు. ఆదివాసీలకు సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసిపి మూడున్నరేళ్ల పాలనలో గ్రామ సమస్యలు పరిష్కారం చేయలేదని, అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్యబెట్టారని తెలిపారు. సిపిఎంలో చేరిన వారిలో సోడే సూరిబాబు, సోడే నాగయ్య, కృష్ణ కుమార్, పాయం శంకరయ్య, సోడే కన్నయ్య, సోడే చిన్న కన్నయ్య, పండా నాగరాజు, వెట్టి రాములమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కుంజా సీతారామయ్య, పల్లపు వెంకట్, మండల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మడకం చిన్నయ్య, మొర్రం రంగమ్మ, కలుముల మల్లేష్, వీరయ్య కనుమల లక్ష్మయ్య, పాండురంగయ్య, సుబ్బారావు, కారం కొండయ్య, పల్లపు రాములు, తెపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన సిపిఎం చేరిన నాయకులు

నీటి సరఫరా కార్మికులకు టిడిపి సంఘీభావం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ తొమ్మిది రోజుల నుండి రంపచోడవరం ఐటీడీఏ ముందు రిలే నిరాహార దీక్ష చేస్తున్న సత్య సాయిబాబా వాటర్ సప్లై వర్కర్లకు టిడిపి మారేడుమిల్లి మండల నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా శేషు కుమార్ మాట్లాడుతూ 10 నెలల నుండి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి వారికి రావాల్సిన జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే టిడిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మారేడిమిల్లి మండల ప్రధాన కార్యదర్శి పొడియం శ్రీను బాబు, కుట్రవాడ ఉపసర్పంచ్ పల్లాల భూపతిరెడ్డి, నాయకులు పండల జనార్దన్ రెడ్డి, మడకం వెంకటేష్, కత్తుల రత్నారెడ్డి, ఎ.రాజు, కుంజం ముత్తన్నదొర, సారపు నరసింహ దొర, మడి చిన్నాళ్ల దొర, అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, సత్య సాయి బాబా వాటర్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షా శిబిరంలో కూర్చున్న టిడిపి నాయకులు

తామరపల్లిలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి -రంపచోడవరం

మండలం తామరపల్లి పంచాయతీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉదయం నుంచి సచివాలయం వద్ద రోగులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో తిరిగి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెవిన్, డాక్టర్ శ్వేత, హెల్త్ అసిస్టెంట్ సతీష్, హెచ్‌వి జానకి, ఎఎన్ఎం వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆమె ఇంటి దగ్గర వైద్యం అందిస్తున్న డాక్టరు, వైద్య సిబ్బంది

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

సంపన్నులకు రాయితీలు, సామాన్యులపై భారాలు

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-కొయ్యూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తూ, సామాన్యులపై భారాలు వేస్తుందని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సిఐటియు కొయ్యూరు మండల మహాసభ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయని, దీంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. మరో వైపు పెద్దలు ప్రయాణించే ప్రైవేటు విమానయాన సంస్థలకు ఇంధనం ధరలు తగ్గించడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి ఎవరిపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. వాస్తవంగా ముడిచమురు ధరలు తక్కువగా ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న పన్నులే అధికంగా ఉన్నాయని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 21 తేదీల్లో జరుగు సిఐటియు అల్లూరు జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 13 మందితో మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, రత్నం, ఆశావర్కర్లు దేవుడమ్మ, సావిత్రి, చిలకమ్మ, మిడ్డేమీల్స్ కార్మికులు కన్నయమ్మ, దార, రమణమ్మ, మణి, విఒఎ మల్లేష్, హాస్టల్ వర్కర్ రమణ, గిరిజన సంఘం నాయకులు సూరిబాబు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో చెత్త నిర్వహణపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు వరకు ఈ ర్యాలీ సాగింది. ఆరుబయట చెత్త వేయొద్దు, అపరిశుభ్రం చేయొద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకొని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు వచ్చేటప్పుడు బండిలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ పోలీసులు

రోడ్డు పనులు పూర్తి చేయరూ..

రోడ్డుపై వేసిన మెటల్ ,

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: మండలంలో కొరవంగి, గిన్నెలకోట, బూసిపుట్ పంచాయతీల ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. కొరవంగి నుండి సుమారు 9 కిలోమీటర్ దూరం వరకు మెటల్ రోడ్డు నిధులు మంజూరు కావడంతో మెటల్ కుప్పలుగా వేసి రోలింగ్ చేయకుండా వదిలేశారు. ద్విచక్ర వాహనం కూడా ఈ రహదారి నుండి మిగత గ్రామాలకు చేరు కొలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు గుండా పెదబయలు మండల కేంద్రానికి, రూడకోట ఆసుపత్రికి, జీసిసి డిపో కు గిరిజనులు వెళుతుంటారు. రహదారి సమస్య పరిష్కరించాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించినా స్పందించ లేదన్నారు.

టిడిపి గెలుపే ధ్యేయం

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అధిష్టానం చేపడుతున్న 'ఇదేం ఖర్మ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరిం చాలని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ సమిష్టిగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో బలరాం కోరారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇదేం ఖర్మ విజయవంతంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కిల్లో బలరాం మాట్లాడుతూ, ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని అధిష్టానం దృష్టికి పంపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు కే.సన్యాసమ్మ, కిరసాని లైకోన్, ముకుంద పడాల్, రఘుపతి పడాల్, కె లైకోన్, భగత్ రామ్, వనబసింగి పంచాయతీ సర్పంచ్ వి.లక్ష్మణ్, కె.శివ శంకర్, యువ నాయకులు గోపాల్‌రావు, మజ్జి చిన్ని బాబు, ప్రభ, భగత్ రామ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-పెదబయలు :విశాఖలో జరిగిన జిల్లా స్థాయి క్రీడలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి త్రో బాల్, ఖో ఖో పోటీలకు విద్యార్థులు ఎంపిక అయ్యారని సెంటాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సారా తెలిపారు. చదువుతో పాటు విద్యార్థినిలు క్రీడలలో ప్రతిభ కనబరచి పాఠశాల కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రాజు అభినందించారు.

మన్యంలో భయం...భయం

పిఎల్‌జిఎ వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల ముమ్మర తనిఖీలు

పాడేరు లోచలిపుట్టులో కార్డెన్ సెర్చ్ చేస్తున్న సిఐ, ఎస్ఐ,

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మావోయిస్టు పార్టీ పిలుపు నిచ్చిన పిఎల్‌జిఎ వారోత్సవాలు ఎఒబిలో శుక్రవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. మావోయిస్టు పార్టీ సంబంధించి ఎఒబిలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మావోయిస్టుల పిఎల్‌జిఎ వారోత్సవాలను భగ్నం చేసే లక్ష్యంగా పోలీసులు ఎఒబి వ్యాప్తంగా ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నాయి.

అన్ని మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాల ప్రధాన జంక్షన్‌లలో పోలీసు బలగాలు వాహనాల తనిఖీలను చేపడు తున్నాయి. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రయాణికుల లగేజి బ్యాగులను సోదా చేస్తున్నారు. పోలీసు బలగాలు ఎక్కడికక్కడ మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో ముమ్మర తనిఖీలు

మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో స్థానిక సిఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వారోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలుచోట్ల విస్తత తనిఖీలు నిర్వహించి అనుమాని తులను ప్రశ్నించారు. లోచలిపుట్టు ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానితుల వివరాలు సేకరించారు.

పెదబయలు: వారోత్సవాల సందర్భంగా సిఆర్‌పిఎఫ్ 198 కంపెనీ బెటాలియన్‌తో ఎస్ఐ పులి మనోజ్ కుమార్ మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. రాజకీయ నాయకులు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని సూచించారు.

సీలేరు : పీపుల్స్ లేబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) వారోత్సవాలు ఈ నెల 2 నుంచి 8 వరకు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అణువణువునా గాలిస్తున్నారు. పిఎల్‌జిఎ వారోత్సవాలను భగ్నం చేయడానికి ఆంధ్రా, ఒడిశా పోలీసులు సరిహద్దుల్లో పాగా వేసి జల్లెడ పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఏఒబి సరిహద్దు ప్రాంతంలో ఒడిశా పోలీసులు వాహన తనిఖీలు చేశారు. మావోయిస్టులు అమర్చిన మందు పాత్రలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేయించారు. స్థానిక ఎస్పై రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సీలేరు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సీలేరు లాడ్జిలో ఉన్న వ్యక్తులను ప్రశ్నించి ఆధార్ కార్డులు, వారి వివరాలు సేకరించారు. ప్రధాన కూడళ్లలో సిఆర్‌పిఎఫ్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

రాజకీయ నాయకులకు నోటీసులు

పిఎల్‌జిఎ వారోత్సవాలు నేపథ్యంలో స్థానిక ఎస్పై రామకృష్ణ మావోయిస్టు లిస్టులో ఉన్న వారితోపాటు ప్రజాప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. వారోత్సవాలు ముగిసే వరకు ఇంటి నుండి బయటకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సిఐ ఆర్.రవికుమార్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ శుక్రవారం లోతట్టు ప్రాంతాలను జల్లేడు పట్టారు. వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల నుండి వివరాలు సేకరించారు. ప్రజా ప్రతినిధులు పోలీసులు అనుమతి లేకుండా లోతట్టు గ్రామాల్లో పర్యటించకూడదని సూచించారు.

రాజవొమ్మంగిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు... సీలేరులో నేతలకు నోటీసులిస్తున్న పోలీసులు

ఓటర్ల నమోదు వేగవంతం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతానికి రాజకీయపార్టీల నేతలు సహకరించాలని ఆర్‌డిఒ ఎన్.భాస్కరరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోందని, ప్రాథమిక సమాచారం ప్రకారం 18ఏళ్ల నిండి అర్హత కలిగిన ఓటర్లు దాదాపు 14వేల మంది ఉంటే కేవలం 1500 'ఫారం ఎ' దరఖాస్తులు వచ్చాయన్నారు.ఓటరుగా నమోదుకు ఇంజినీరింగ్ విద్యార్థులు అంతగా ఆసక్తి కనబరచడం లేదన్నారు. ఈ నెల 6 తర్వాత ఇంజనీరింగ్ కళాశాలల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి ఓటర్లగా నమోదుపై చైతన్య పరుస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. గతనెల 9న విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితాలో జిల్లాలోనే అత్యధికంగా 3,,18, 624మంది ఓటర్లు భీమిలి నియోజకవర్గంలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో డూప్లికేషన్ లేకుండా చూడాలని టిడిపి నేత గంటా నూకరాజు సూచించారు.శాశ్వతవలసలు, మృతులపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో వైసిపి నేత ఎం.షణ్ముఖరావు, బిజెపి ప్రతినిధి కె.రామానాయుడు, సిపిఐ నేత రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-అనంతగిరి:రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక వైద్యాధికారిణి జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. కొత్తూరు సబ్ సెంటర్ సచివాలయం వద్ద శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిలకలగెడ్డ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించామని ఆమె తెలిపారు.

డుంబ్రిగూడ: మండలంలోని గుంట గన్నెల పంచాయతీ కేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 40 మంది వ్యాధిగ్రస్తులకు స్థానిక డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రేమ,104 వైద్యాధికారి సిద్ధార్థ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రేమ మాట్లాడుతూ, గ్రామాల్లో వ్యాధులు సోకిన వెంటనే స్థానిక ఆశ కార్యకర్తకు సమాచారం అందిస్తే వైద్య సిబ్బంది వెంటనే గ్రామంలో సందర్శించి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి పద్మ, హెల్త్‌అసిస్టెంట్ కె.రవీంద్ర, సిహెచ్‌ఓ ప్రియా, ఏఎన్ఎం భానుమతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం 27వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుల్లి సింహాచలం నాయుడు, అయ్యప్ప భక్తుల వర్తక సంఘం నాయకులు, మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల దొంగలు అరెస్ట్

పోలీసులు స్వాధీనం చేసుకున్న తొమ్మిది పల్సర్ బైక్‌లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి 9 పల్సర్ మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుధాకర్ తెలిపారు. శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాడేరు, జి.మాడుగుల, పెదబయలులో గత మూడు నెలల్లో మోటారు సైకిళ్ల దొంగతనాలు కేసులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం దగుడిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి 9 పల్సర్ మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు కనబడితే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, పోలీసు సిబ్బందిపాల్గొన్నారు.

గుంతలు పూడుస్తున్న ఆటో డ్రైవర్లు

రహదారి గోతులు పూడ్చిన ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కాకరపాడు నుండి కొయ్యూరు వచ్చే రహదారిలో గోతులను కాకరపాడు ఆటో యూనియన్‌కు చెందిన డ్రైవర్లు శ్రమదానం చేసి పూడ్చారు. కాకరపాడు నుండి కొయ్యూరు వెళ్లే రహదారి అధ్వానంగా తయారై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆర్ అండ్ బి శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో కాకరపాడుకు చెందిన ఆటో డ్రైవర్లు గుంతల్లో మట్టిని పూడ్చి మరమ్మతులు చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకరపాడు నుండి కొయ్యూరు వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని వారు కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని డౌనూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు, సర్పంచ్ పోట్టిక భవాని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పెడుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఎత్తు కొలిచి బరువు తూకం వేశారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గర్భిణులు ఆకుకూరలు, గుడ్లు, పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దేముడమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే అధికంగా ఉందని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 610వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఆటో కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగాన్ని కాపాడుతామని, నల్లధనాన్ని వెలికి తీసి దేశ ప్రజలందరికీ పంచుతామని చెప్పిన మోడీ నేడు పబ్లిక్ సెక్టార్‌ను పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉన్నందున అమ్మి వేస్తున్నట్లు బిజెపి చెప్పడం సరికాదన్నారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులు ఎందుకు కొనుగోలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అడ్డుకోవాలని కోరారు. కార్మిక, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాయని స్పష్టం చేశారు. విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. దీక్షల్లో ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు సత్తిబాబు, సురేష్, గాడు సూరిబాబు, శ్రీధర్, ఎస్.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఆవకాశం ఉందని ప్రముఖ వైద్యులు, కవి పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు ఉద్ఘాటించారు. విశాలాంధ్ర 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఆయన శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణాలయం దశాబ్దాలుగా సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తోందన్నారు. పస్తుత కంప్యూటర్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఆదరణ తగ్గలేదని ఈ ప్రదర్శన చూస్తే తెలుస్తోందని అన్నారు.

బిజెపిలో ముసలం

చిచ్చుపెట్టిన విఐపి పాస్‌ల వ్యవహారం
మోడీ సభకు భారీ వసూళ్లపై తలెత్తిన విభేదాలు
తోట నగేష్ రాజీనామాతో బయటపడ్డ లోగుట్టు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రధాని మోడీ విశాఖ పర్యటన బిజెపిలో చిచ్చు తెచ్చిపెట్టింది. నవంబరు 12న విశాఖలో జరిగిన మోడీ సభను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. కానీ మోడీ సభ పేర చందాల వసూలు మొదలుకొని విఐపి పాస్‌లను పార్టీతో సంబంధంలేని వ్యక్తులకు లక్షల రూపాయలకు బిజెపి నాయకులు అమ్ముకున్నారన్న ఆరోపణలు ఆ పార్టీలోనే గుప్పుమంటున్నాయి. ప్రధాని సభకు వచ్చిన 70 పాస్‌ల్లో అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షునికి కూడా విఐపి పాస్ ఇవ్వకుండా, పార్టీతో ఏ మాత్రమూ సంబంధంలేని ఓ వ్యాపారికి, పోలీసు కేసులున్న ఓ వ్యక్తికి పాస్‌లిచ్చి మోడీని కలిసేలా చేశారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మోడీ సభను ఉపయోగించుకొని నగరానికి చెందిన ఓ బిజెపి నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించుకొని కంపెనీల నుంచి భారీగా చందాలు వసూలు చేశాడన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వాన్ని విస్మరించి ఇతరులకు పాస్‌లు అమ్మడం, చందాల వసూళ్లను విభేదించిన ఉమ్మడి విశాఖపట్నం గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేశారు. పార్టీలో సీనియర్లకు పాస్‌లు ఇవ్వకపోవడంపై ఆ పార్టీలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. పార్టీ సభ్యత్వానికి కాకుండా రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేసిన లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు పంపించడంతో చర్చనీయాంశంగా మారింది.

ప్రజా సమస్యలపై పార్టీ స్పందించిన తీరు విసుగు తెప్పించినట్లు నగేష్ చెబుతున్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీల రైతుల బకాయిలు, హెటిరో డ్రగ్స్ కంపెనీ పైపులైన్ నిర్మాణానికి వ్యతిరేకంగా 300 రోజులకుపైగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా పార్టీ పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతులు, మత్స్యకారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామన్నా పార్టీ నాయకత్వం స్పందించలేదన్నారు. పాయకరావుపేటలోని చేనేత కార్మికుల సొసైటీకి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా సహకారం అందించేందుకు కనీస ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఇంకా.. బిజెపి నాయకత్వంపై నగేష్ తీవ్రమైన విమర్శలే చేశారు. స్మార్ట్ విలేజ్ పేరుతో ఉద్యోగాలిస్తామని చేసిన రూ.300 కోట్లు వసూళ్లపై బినామీలు బయటపడాలంటే సిబిసిఐడి కాకుండా సిబిఐతో దర్యాప్తు చేయించి, ఇడి అటాచ్‌మెంట్ చేయాలని కూడా ఆయన అన్నారు. స్థానిక నాయకత్వానికి కనీస సమాచారమివ్వకుండా కంపెనీల నుంచి చందాలు వసూలు చేసిన విషయం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పార్టీ నాయకత్వం స్పందించలేని పరిస్థితుల్లో ఉందని తెలిపారు. ప్రధాని సభకు పార్టీతో సంబంధంలేని వ్యక్తులకు పాస్‌లు ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు వారు స్పానర్ చేశారని నగరానికి చెందిన ఉత్తరాంధ్రతో సంబంధాలున్న ఓ పెద్ద మనిషి ఇచ్చిన సమాధానంపై నగేష్ అసంతృప్తి వ్యక్తంచేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధాని మోడీ రాకను కొంతమంది బిజెపి నాయకులు సొమ్ము చేసుకున్నారన్న విషయం బయటకు పొక్కడంతో పార్టీలో పెద్ద దుమారం రేగింది.

విభజన హామీలపై ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విభజన హామీలు ఆంధ్రుల హక్కు అని, వాటన్నింటినీ అమలుచేసి తీరాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ నాన్ పొలిటికల్ జెఎసి అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరినాయుడు అన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు తదితరాలను అమలుజరపాల్సిందేనన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తి చేయాలన్నారు. షెడ్యూల్ 9, 10, 13లో పొందుపరిచిన అన్ని సంస్థలనూ ఎపిలో తక్షణమే నెలకొల్పాలన్నారు

వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు

వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-కూనవరం

జులైలో వచ్చిన వరదలకు నష్టపోయిన బాధితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.10వేలు చొప్పున నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కూటూరు సచివాలయంలో విఆర్‌ఒకు పోలవరం ముంపు నిర్వాసితులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతూ ముల్లూరు, కూటూరు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ముంపు భూములకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

వైస్ ఎంపిపి ఆధ్వర్యాన వినతులు

మండలంలోని లింగాపురం, పెదర్కూర్, అభిచర్ల, రేగుల పాడు పంచాయతీల్లో బాధితులకు వరద సహాయం అందించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య ఆధ్వర్యంలో ఆయా సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, బొడ్డు కాంతమ్మ, శంకర్, రామారావు, సుబ్బయ్య బాబురావు, జ్యోతి, శీలం వెంకమ్మ రత్తయ్య, వార్డు సభ్యులు కట్టం ప్రభాకర్, సోడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వక్తలు

లింగ వివక్ష చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ లింగ వివక్షపై మూడు వారాల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్త్రీలు ఎక్కడ పూజింప బడుతారో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని, కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని తెలిపారు. నేడు స్త్రీలు అనేక రకాల వివక్షలకు గురవుతున్నారని, ఆధునిక కాలంలో కూడా కుల, మత, జాతి, లింగ వివక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. లింగ వివక్ష నేరమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటరావు మాట్లాడుతూ ఆడపిల్ల ఆంటే నష్టం అనే భావన ఇంకా సమాజంలో కొనసాగుతుందన్నారు. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే గర్భవిచ్ఛిన్నం చేయిస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారత విభాగ కో-ఆర్డినేటర్ కె.శైలజ మాట్లాడుతూ సమాజంలో మగవారితో సమానంగా ఆడవారు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఫిజిక్స్ శాఖాధిపతి శేఖర్, బోటని శాకాధిపతి డాక్టర్ వై.పద్మ వివక్ష నిర్మూలన అనేది ముందు మన ఇళ్లలోనే మొదలు కావాలని, మన ఇళ్లల్లో అందరికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.శేఖర్, అప్పనమ్మ, హారతి, పద్మ, శకుంతల, శైలజ, రాజబాబు, శ్రీలక్ష్మి, గౌతమి, ఏడుకొండలు, మౌనిక, సాయికుమార్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం ధారకొండకు విద్యుత్తు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రెండు రోజులుగా అంధకారంలో నెలకొంది. విషయం తెలుసుకున్న ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది ధారకొండ చేరుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం అమర్చారు. ధారకొండకు విద్యుత్తు సరఫరా చేయడానికి ధారకొండ శివారులో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం ఉదయం దీని నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగి కాలిపోయింది. దీంతో ఆ గ్రామానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు సిబ్బంది పరిశీలించి విషయాన్ని చింతపల్లి ఏఈఈ రమణకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ రప్పించే శుక్రవారం అమర్చారు.